సాక్షి చిత్తూరు

బుధవారం । 22 । ఫిబ్రవరి । 2023



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.54,000
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,100

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.68,000
రిటైల్ వెండి గ్రాము	రూ.69

	గరిష్ఠం	కనిష్ఠం
చిత్తూరు	34	17
తిరుపతి	34	17
తిరుమల	31	13
గూడూరు	34	19
నగరి	35	18



పేదల భూముల్లో 'పచ్చ' గద్దలు

టీడీపీ నేతల కబంధ హస్తాల నుంచి తమ భూములను కాపాడాలని తమ భూములను కాపాడాలని నగరి మండలంలోని ఓజీ కుప్పం రైతులు వేడుకుంటున్నారు. – 8లో

న్యూస్‌రీల్

లక్ష్మీగణపతి పూజకు ఆహ్వానం



శారదా పీఠాధిపతితో మోహన్‌రెడ్డి, వెంకటేశు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో నిర్వహించనున్న లక్షమోదక లక్ష్మీగణపతి హవన పూజకు విశాఖ శారదాపీఠాధిపతికి ఆహ్వానం అందించారు. మంగళవారం ఈమేరకు హర్యానాలోని కురుక్షేత్రంలో ఉన్న పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి, ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతికి ఆలయ కమిటీ చైర్మన్ మోహన్‌రెడ్డి ఈఓ వెంకటేశు ఆహ్వాన పత్రిక అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మార్చి 3 నుంచి 5వ తేదీ వరకు మూడురోజుల పాటు పీఠాధిపతుల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పూజాధి కార్యక్రమాలు విశాఖ పీఠాధిపతుల స్వాములచే నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గజల్ శ్రీనివాస్ ఉన్నారు.

చింతమాకులపల్లె పాఠశాలకు 'హరిత' అవార్డు



అవార్డు అందుకుంటున్న రామచంద్రారెడ్డి

శ్రీరంగరాజపురం: మండలంలోని చిల్లమాకులపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలకు నేషనల్ గ్రీన్ స్కూల్ ప్రోగ్రామ్ కింద హరిత అవార్డు దక్కింది. మంగళవారం న్యూఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయుడు ఎస్.రామచంద్రారెడ్డి అవార్డుఅందుకున్నారు. ఏపీ ఎన్‌జీసీ డైరెక్టర్ స్రవంతి, కో–ఆర్డినేటర్ నీలకంఠయ్య, ఎంఈఓ అరుణచలంరెడ్డి అభినందనలు తెలిపారు.

వేగంగా అసైన్డ్ భూముల గుర్తింపు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని అసైన్డ్ భూముల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ హరినారాయణన్ ఆదేశించారు. మంగళవారం ఆర్డీఓలు, సర్వే డీటీలు, సర్వేయర్లతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. శ్మశాన వాటికలకు స్థల కేటాయింపులు పలుచోట్ల పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఈ మేరకు వెంటనే సర్వే చేసి భూములు అప్పగించాలని సూచించారు. అలాగే 22 ఏ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. రెండో విడత రీ సర్వేను పకడ్బందీగా నిర్వహించి, రాళ్లు నాటించాలని స్పష్టం చేశారు.

ఎన్నికల సిబ్బందికి పకడ్బందీ శిక్షణ



మాట్లాడుతున్న డీఆర్‌ఓ రాజశేఖర్

చిత్తూరు కలెక్టరేట్ : ఎన్నికల సిబ్బందికి పకడ్బందీగా శిక్షణ ఇవ్వాలని డీఆర్‌ఓ రాజశేఖర్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల నిబంధనలు, పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియపై సిబ్బందికి పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



స్వామి,అమ్మవార్ల కల్యాణం జరిపిస్తున్న ఆలయ వేదపండితులు



పెళ్లికొడుకు అలంకరణలో పూజలందుకుంటున్న శివయ్య



అమ్మవారికి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

భవుని వైభోగం

ముక్కోటి దేవతలు మురిపెంగా చూస్తుండగా.. ప్రమథ గణాలు పర్యవేక్షిస్తుండగా.. చతుర్ముఖుడు పౌరోహిత్యం వహించగా.. వైకుంఠనాథుడు కన్యాదాతగా వ్యవహరించగా.. దక్షిణ కైలాస క్షేత్రంలో లయకారుడు వరుడిగా.. జగజ్జనని వధువుగా.. ఆకాశమే పందిరిగా.. భూలోకమే పీఠంగా.. సమస్త జీవకోటి సాక్షిగా.. కనులపండువగా ఆదిదంపతులు ఒక్కటయ్యారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీకాళహస్తీశ్వరుని కల్యాణ వేడుకను వేదపండితులు కమనీయంగా నిర్వహించారు. అపురూప ఘట్టాన్ని వీక్షించి భక్తజనులు తరించారు.

- శ్రీకాళహస్తిలో నేత్రపర్వంగా శివపార్వతుల కల్యాణం
- దేవుడి పెళ్లినాడే వివాహం చేసుకున్న 63 జంటలు
- నూతన వధూవరులకు తాళిబొట్లు, వస్త్రాలు పంపిణీ చేసిన మంత్రి, ఆలయ చైర్మన్



నూతన వధూవరులకు తాళిబొట్లు, నూతన వస్త్రాలు పంపిణీ చేస్తున్న మంత్రి ఆర్కే రోజా దంపతులు, ఆలయ చైర్మన్

తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్): మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన దేవుడి పెళ్లి తంతును ఆలయ వేదపండితులు ఆగమోక్తంగా నిర్వహించారు. పట్టణంలోని పెళ్లిమండపం వద్ద నడివీధిలో పెళ్లిపీటలేసి.. స్వామి, అమ్మవార్ల తరఫున పినపెద్దల సమక్షంలో పెళ్లితంతును పూర్తి చేశారు. అనంతరం నూతన వధూవరులైన స్వామి, అమ్మవార్లు పురవీధుల్లో ఊరేగుతూ ఆలయానికి వేంచేశారు. అంతకుముందు స్వామి, అమ్మవార్ల అలకలు.. బుజ్జగింపులు.. పెళ్లి ఒప్పందాల ఘట్టాన్ని అర్చకపండితులు రక్తికట్టించారు.

అలకలు..బుజ్జగింపులు

అలకలు, బుజ్జగింపులు మానవుల్లోనే కాదు.. దేవతల్లోనూ ఉంటాయని పురాణాల్లో పలు సంఘటనలున్నాయి. రోజా పక్కన గంగమ్మతో ఉండే పరమేశ్వరుని వివాహం చేసుకోవడానికి జ్ఞానప్రసూనాంబ అంగీకరించదు. ఇందుకు ఆమె తండ్రి పర్వతరాజు కూడా మద్దతుగా నిలవడంతో.. చివరకు చండికేశ్వరుడు తన చాతుర్యంతో పర్వతరాజును మెప్పించి వివాహానికి అంగీకరింపజేస్తాడు. స్వామివారికి పార్వతీదేవినిచ్చి వివాహం జరిపించాలని చండికేశ్వరుడు పర్వతరాజును కోరగా గంగాదేవితో ఊరేగుతున్న ఆయనకు తన కుమార్తెతో ఎలా వివాహం జరిపించాలని ప్రశ్నించిన ఘట్టం ఆద్యంతం రక్తికట్టింది. ఈ ఆసక్తికర సంఘటన సోమవారం అర్ధరాత్రి తర్వాత శ్రీకాళహస్తిలో చోటుచేసుకుంది. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా మంగళవారం తెల్లవారుజామున 3గంటలకు స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం నేత్రపర్వంగా జరిగింది. స్వామివారు గంగాదేవి, స్కందుడు (సుబ్రహ్మణ్యస్వామి)తో కలిసి గజ వాహనంపై పెళ్లి మండపానికి వేంచేయగా.. జ్ఞానప్రసూనాంబ మాత్రం సింహ వాహనంలో ఒంటరిగా నేఫ్రూ వీధిలోనే నిలిచిపోయారు. ఈ క్రమంలో అర్చకులు కల్యాణోత్సవం సందర్భంగా గంగాదేవి కన్పించకుండా పూలతో కప్పి ఉంచారు. తర్వాత పర్వతరాజు వివాహానికి అంగీకరించడంతో పార్వతీదేవి కల్యాణ మండపానికి చేరుకుంటారు. అనంతరం స్వామి, అమ్మవారి కల్యాణాన్ని వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. వివాహం అనంతరం పలువురు భక్తులు స్వామి, అమ్మవార్లకు చదివింపులు చదివించారు. కార్యక్రమంలో మంత్రి ఆర్కే రోజా దంపతులు, చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, ఎమ్మెల్యే కుమార్తె పవిత్రరెడ్డి, ఈఓ కేవీ సాగర్‌బాబు, ఆర్డీఓ రామారావు, సహస్ర అవధాని మాడుగుల నాగఫణిశర్మ, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

ఒక్కటైన 63 జంటలు

స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం సందర్భంగా 63 జంటలు ఒక్కటయ్యాయి. బ్రహ్మ ఘడియల్లో స్వామి,అమ్మవార్ల కల్యాణానికి నిర్ణయించిన సుముహూర్తాన నూతన వధూవరులు పెళ్లి చేసుకుని.. కొత్త జీవితంలోకి అడుగుపెట్టారు. వారికి మంత్రి ఆర్కే రోజా, ఆలయ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, ఈఓ సాగర్ బాబు చేతుల మీదుగా నూతన వస్త్రాలు, తాళిబొట్లు పంపిణీ చేశారు.

ఘనంగా ఊరేగింపు

నూతన వధూవరులైన స్వామి, అమ్మవార్ల ఊరేగింపు మంగళవారం ఉదయం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున కల్యాణం జరిగిన తర్వాత స్వామి, అమ్మవార్లు ఆలయానికి వేంచేశారు. అనంతరం కొద్దిసేపటి తర్వాత తిరిగి ఎద్దుల బండ్లపై పురవీధుల్లో ఊరేగుతూ కనువిందు చేశారు.

వేడుకగా సభాపతి కల్యాణం

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా మంగళవారం రాత్రి శ్రీకాళహస్తీశ్వరాలయంలో శ్రీసభాపతి కల్యాణం వేడుకగా జరిగింది. శివకామసుందరి సమేత నటరాజస్వామి ఉత్సవమూర్తుల వివాహాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. ఆలయ ఆవరణలోని అచ్యుతరాయలు మండపంలో పూజారులు, వేదపండితులు సంప్రదాయబద్ధంగా వివాహం జరిపించారు.

నేడు గిరిప్రదక్షిణ

శ్రీకాళహస్తి: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో గిరిప్రదక్షిణ అనేది కల్యాణానికి వచ్చిన దేవతలు, రుషులకు వీడ్కోలు పలికే యాత్రగా పురాణాల్లో అభివర్ణించారు. సంక్రాంతిలో కనుమ పండుగ నాడు గిరిప్రదక్షిణ చేసి దేవతలు, రుషులను తమ కల్యాణానికి రావాలని శ్రీజ్ఞానప్రసూనాంబ సమేత ముక్కంటీశుడు ఆహ్వానిస్తారు. మంగళవారం ఉదయం కల్యాణోత్సవం ముగియడంతో బుధవారం వారిని సాగనంపేందుకు శివయ్య విల్లంబులు ధరించి రుషులు, దేవతలను వారివారి స్థావరాలకు చేర్చేందుకు బయలుదేరనున్నారు.



సిద్ధమైన కొండచుట్టు మార్గం

దీన్నే రుషిరాత్రి అని కూడా అంటారు. ఈ మేరకు ఆలయం తరఫున భక్తులకు తాగునీరు, అన్నదానం, మజ్జిగ పంపిణీ చేయనున్నట్టు ఈఓ సాగర్ బాబు తెలిపారు. గిరిప్రదక్షణకు ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఉభయదారుడుగా వ్యవహరించనున్నారు.

కొండచుట్టు మార్గం అభివృద్ధి

రాళ్లు, రప్పలు, ముళ్ల పొదలతో సుమారు 21 కి.మీ మేర ఉన్న గిరిప్రదక్షణ మార్గాన్ని 16 కి.మీ కుదించి అభివృద్ధి చేశారు. ఇందులో రూ.16 కోట్లు వెచ్చించి 9.5 కి.మీ మేర సిమెంట్ రోడ్డు నిర్మించారు.

పుష్పఫల ప్రసాదం

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో ఆలయంలో 27 రకాల పుష్పాలు, 9 రకాల పండ్లతో అద్భుతంగా అలంకరించారు. వాటిని తీసి గిరిప్రదక్షిణకు వెళ్లే సమయంలో స్థానికులకు పంచిపెట్టనున్నారు.

బడుగులకు జగనన్నే బలం

సాక్షి, చిత్తూరు/చిత్తూరు కార్పొరేషన్ : బడుగు బలహీన వర్గాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డే బలమని డిప్యూటీ సీఎం నారాయణస్వామి, ఎమ్మెల్సీ భరత్, ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, వెంకటేగౌడ స్పష్టం చేశారు. ఎమ్మెల్సీ పదవుల్లో బీసీలకు అధిక ప్రాధాన్యమివ్వడంపై హర్షం వ్యక్తం చేశారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ పేదల అభ్యున్నతే లక్ష్యంగా జగనన్న అహర్నిశలు శ్రమిస్తున్నారని కొనియాడారు. బీసీలను బ్యాక్‌బోన్ క్యాస్ట్‌గా పరిగణిస్తూ వారి సంక్షేమానికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారన్నారు. చంద్రబాబు బీసీలను కేవలం ఓటు బ్యాంకుగానే చూశారని ఆరోపించారు. టీడీపీ హయాంలో 8మంది బీసీలకు మాత్రమే మంత్రి పదవులు ఇచ్చారని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏకంగా 11 మందికి కట్టబెట్టారని వివరించారు. రాజకీయంగా అన్ని పదవుల్లోనూ ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ప్రాధాన్యమిస్తున్నారని తెలిపారు. ఈ క్రమంలోనే 98శాతం ఎన్నికల హామీలను నెరవేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. 2014లో చంద్రబాబు ఇచ్చిన హామీలన్నీ తుంగలో తొక్కినా నోరెత్తని ఎల్లో మీడియా, ఇప్పుడు పేదలకు మంచి జరుగుతుంటే బురదజల్లుతోందని మండిపడ్డారు. చంద్రబాబు ఏనాడూ ప్రజలకు మేలు చేయలేదని, అందుకే లోకేష్ పాదయాత్రకు ఎవరూ స్పందించడం లేదని విమర్శించారు. పక్క రాష్ట్రాల నుంచి పెయిడ్ ఆర్టిస్టులను తీసుకువచ్చి లోకేష్ యాత్ర సాగిస్తున్నారని ఎద్దేవా చేశారు. కుప్పం నియోజకవర్గం దాదాపు 35 ఏళ్లపాటు చంద్రబాబు కబంధహస్తాల్లో నలిగిపోయిందన్నారు. మాటలే తప్ప ఆయన అభివృద్ధి చేసింది శూన్యమని స్పష్టం చేశారు. చంద్రబాబు నిర్లక్ష్యం వల్లే కుప్పం వాసులు వలసపోవాల్సిన దుస్థితి దాపురించిందని ఆరోపించారు. కోవిడ్ సమయంలో ప్రజలను గాలికివదిలేసి, ఎన్నికల సమయంలో కపట ప్రేమ చూపించడమే బాబు నైజమని వివరించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన అభివృద్ధి.. సంక్షేమం రెండు కళ్లుగా సాగుతోందని తెలిపారు. డీపీఐఐటీ నివేదిక ప్రకారం రాష్ట్రంలో రూ.43వేల కోట్లు పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తున్నారని వెల్లడించారు. స్కిల్ డెవలప్‌మెంట్ కింద యువతకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. విప్లవాత్మకైన పథకాలు విద్యారంగం అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. వన్నెకుల క్షత్రియులకు ముఖ్యమంత్రి ప్రత్యేక ప్రాధాన్యమిస్తున్నారని, అందులో భాగంగానే సిపాయి సుబ్రమణ్యంకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించారని వెల్లడించారు. సమావేశంలో మేయర్ అముద, డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్, చుడా చైర్మన్ పురుషోత్తంరెడ్డి, పీకేఎం ఉడా చైర్మన్ వెంకటేష్‌యాదవ్, జెడ్పీ వైస్ చైర్మన్ రమ్య, నాయకులు రెడ్డెప్ప, జ్ఞాన జగదీష్, శేఖర్, నారాయణ, ప్రతిమారెడ్డి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి, ఎమ్మెల్సీ భరత్, ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, వెంకటేగౌడ

మార్కెట్ కమిటీ పరిశీలన

పలమనేరు : స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీని మార్కెటింగ్ కమిషనర్ రాహుల్ పాండే మంగళవారం పరిశీలించారు. ఏఎంసీ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్‌జేడీఎం రామాంజనేయులు, ఆర్‌డీడీఎం లావణ్య, ఏడీఎం పరమేశ్వరన్, ఈఈ వెంకటేశ్వరావు, డీఈ హరినాథ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ హేమంత్‌కుమార్ రెడ్డి, ఉపాధ్యక్షులు పుష్పలత ఆంజనేయులు, సభ్యులు పాటిలు బాబు, మార్కెట్ కార్యదర్శి సంజీవకుమార్ పాల్గొన్నారు.



టమాటా విక్రయాలను పరిశీలిస్తున్న కమిషనర్ రాహుల్ పాండే

కమనీయం..మొగిలీశ్వరుని కల్యాణం



ఆదిదంపతుల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

బంగారుపాళెం: మొగిలీశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం రాత్రి స్వామి, అమ్మవార్ల కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా మొగిలీశ్వరుడు, కామాక్షమ్మవారి ఉత్సవమూర్తులను వధూవరులుగా అలంకరించి పెళ్లిపీటలపై కొలువుదీర్చారు. వేదపండితుల మంత్రోచ్చారణ నడుమ కమనీయంగా కల్యాణ ఘట్టం జరిపించారు. అనంతరం స్వర్ణాలంకారభూషితులైన స్వామి, అమ్మవారు అశ్వ వాహనం అధిరోహించి మాడవీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. కార్యక్రమాలకు చిత్తూరుకు చెందిన న్యాయవాది లోకనాథరెడ్డి, సావిత్రమ్మ కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. బుధవారం రథోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ మునిరాజా, ధర్మకర్త విజయ్‌కుమార్ తెలిపారు.

నేడు ఓటరు జాబితా ప్రచురణ

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నిక ఓటర్ల తుది జాబితాను బుధవారం ప్రచురించనున్నారు. ఈ మేరకు కలెక్టరేట్ అధికారులు ఏర్పాట్లు చేశారు. తుది ఓటర్ల జాబితాను రిటర్నింగ్ అధికారి వెంకటేశ్వర్ విడుదల చేయనున్నారు.

ఎన్నికల అబ్జర్వర్ల నియామకం

చిత్తూరు కలెక్టరేట్ : ఎమ్మెల్సీ ఎన్నికలకు ముగ్గురు అబ్జర్వర్లను నియమిస్తూ ఎలక్షన్ కమిషన్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల అబ్జర్వర్‌గా శ్రీధర్, పట్టభద్రుల ఎన్నికలకు సునీత, ఉపాధ్యాయ ఎన్నికలకు కోన శశిధర్‌ను నియమిస్తున్నట్లు పేర్కొంది.

నేడు 5 నామినేషన్లు



జిల్లా ఎన్నికల అధికారికి నామినేషన్ అందిస్తున్న స్వతంత్ర అభ్యర్థి

చిత్తూరు కలెక్టరేట్ : పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి మంగళవారం ఐదుగురు అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేసినట్టు అధికారులు వెల్లడించారు. స్వతంత్ర అభ్యర్థులుగా ప్రకాశం జిల్లాకు చెందిన కిరణ్ దాసరన్న మట్టిగుంట, మాదసి జాలారావు, భాస్కరరావు కమ్మిశెట్టి, తిరుపతి జిల్లా వాకాడు మండలానికి చెందిన బొట్టికాయల చంద్రశేఖర్, బీజేపీ అనుబంధంగా నాయుడుపేటకు చెందిన సన్నారెడ్డి దయాకర్ రెడ్డి తరఫున జగదీశ్వర్‌నాయుడు నామినేషన్లు వేసినట్లు వివరించారు. ఈ క్రమంలో వైఎస్సార్‌సీపీ బలపరచిన టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి పర్వతనేని చంద్రశేఖర్‌రెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి బుధవారం నామినేషన్‌లు దాఖలు చేయనున్నట్లు ప్రకటించారు. ఉదయం 8.30 గంటలకు చిత్తూరు గాంధీ సర్కిల్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీగా వెళ్లి నామినేషన్ వేయనున్నట్లు పేర్కొన్నారు.

క్లుప్తంగా

యువకుడి ఆత్మహత్య



లోకేష్ మృతదేహం

కుప్పం: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద బావిలో దూకి ఓ యువకుడు మంగళవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలు.. స్థానిక గుడుపల్లె రోడ్డుకు చెందిన రామకృష్ణ కుమారుడు లోకేష్ (26)డిగ్రీ పూర్తి చేసి బెంగళూరులో ఉద్యోగం చేస్తుండేవాడు. ఈ మధ్య మతి స్థిమితం లేకుండా ప్రవర్తిస్తుండడంతో లోకేష్‌ని ఉద్యోగానికి వెళ్లనివ్వకుండా ఇంట్లో నిలిపేశారు. ఈ క్రమంలోనే ఎన్ని సంబంధాలు చూసినా పెళ్లి కుదరకపోవడంతో మనస్తాపం చెందేవాడు. ఇంతలో ఏం జరిగిందో తెలియదు కానీ బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఒక్కగానొక్క కుమారుడు మరణించడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. అర్బన్ ఎస్ఐ శివకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మేయర్ హత్య కేసు విచారణ వాయిదా

చిత్తూరు అర్బన్: మేయర్ అనురాధ, ఆమె భర్త కటారి మోహన్ హత్య కేసు విచారణ ఈనెల 27వ తేదీకి వాయిదా పడింది. మంగళవారం చిత్తూరు ప్రత్యేక మహిళా కోర్టు ఈమేరకు ఆదేశాలు జారీ చేసింది.

మార్చి 7న వాచ్‌లు, మొబైల్ ఫోన్ల ఈ-వేలం

తిరుపతి అలిపిరి: తిరుమల శ్రీవారి ఆలయంతో పాటు ఇతర అనుబంధ ఆలయాలలో హుండీ ద్వారా భక్తులు కానుకగా సమర్పించిన వాచ్‌లు, మొబైల్ ఫోన్లను మార్చి 7వ తేదీ రాష్ట్ర ప్రభుత్వ కొనుగోలు పోర్టల్ ద్వారా ఈ- వేలం వేయనున్నారు. ఇందులో వివిధ కంపెనీల వాచ్‌లు, మొబైల్ ఫోన్లు ఉన్నాయి. కొత్తవి/ఉపయోగించిన/పాక్షికంగా దెబ్బతిన్న వాచ్‌లు మొత్తం 22 లాట్లు, మొబైల్ ఫోన్లు 18 లాట్లు ఈ-వేలంలో ఉంచారు. ఇతర వివరాలకు తిరుపతిలోని టీటీడీ మార్కెటింగ్ కార్యాలయాన్ని 0877-2264429 నంబరులో కార్యాలయం వేళల్లో, టీటీడీ వెబ్‌సైట్ www.tirumala.org లేదా రాష్ట్ర ప్రభుత్వ పోర్టల్ www.konugolu.ap.gov.inను సంప్రదించగలరు.

అపురూపం

నేడు అంతర్జాతీయ కవలల దినోత్సవం

కవలలు.. దేవుడి సృష్టించిన అపు'రూపాలు'.. చూసేందుకు ఒకేలా ఉంటారు.. చూడగానే ఆకట్టుకుంటారు.. ఒక్కోసారి చూపరులను గందరగోళంలో పడేస్తారు.. పదిమందిలో సైతం ప్రత్యేకంగా కనిపిస్తారు.. వ్యక్తిత్వం విభిన్నంగా ఉన్నా గమ్మత్తుగా అనిపిస్తారు.. అభిరుచులు వేరుగా ఉన్నా అందరి అభిమానం చూరగొంటారు. ఒక్క జంటే అబ్బురపరిస్తే.. చిత్తూరు నగరంలోని క్యాంఫోర్డ్ పాఠశాలలో 23 కవల జంటలు విద్యాభ్యాసం చేస్తున్నారు. బుధవారం అంతర్జాతీయ కవలల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారమే ఈ పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. అద్భుతంగా కనిపించే కవలలందరూ ఒకేచోట చేరి కనువిందు చేశారు. - చిత్తూరు కలెక్టరేట్



క్యాంఫోర్డ్ పాఠశాలలో 23 జంటల కవలలు



ఇద్దరు ఇద్దరే

జీడీనెల్లూరు మండలం నాసన్‌పల్లెకు చెందిన ప్రశాంతి, ప్రత్యూష కవలలు. అల్లరిలో ఇద్దరూ ఇద్దరే. ఎక్కడికెళ్లినా ఇద్దరినీ తీసుకెళ్లాల్సిందే. ఏది తెచ్చినా ఇద్దరికీ తీసుకురావాలి. పిల్లలను అపురూపంగా చూసుకుంటున్నట్లు తల్లిదండ్రులు జీవన్‌ప్రసాద్, పూజిత తెలియజేస్తున్నారు. - ప్రశాంతి,ప్రత్యూష

ఒకరికొకరు



చిత్తూరు నగరంలోని ప్రశాంత్ నగర్‌కు చెందిన తనయ్, తన్య కవలలు. ఒకే కాన్పులో కొడుకు, కూతురు పుట్టడంతో తల్లిదండ్రులు ఎంతో సంతోషించారు. వీరిద్దరిని ఒకే పాఠశాలలో చదివిస్తున్నారు. అన్నా చెల్లెలు ఒకరికి ఒకరు అన్నట్లు చాలా ప్రేమగా ఉంటారని తల్లిదండ్రులు ఉమాపతి, సుకన్య ఆనందగా వెల్లడించారు. - తనయ్, తన్య

చలాకీగా..



చిత్తూరులోని రాంనగర్‌కాలనీకి చెందిన అర్జున్, అంజన్ కవలలు. వీరిద్దరి అభిరుచులు దాదాపు ఒకటిగానే ఉంటాయి. ఎంతో చలాకీగా ఉంటారు. ఇద్దరూ కవలల దినోత్సవం రోజునే జన్మించారు. వీరి పోలికలకు స్కూల్‌లో టీచర్లు కూడా తికమకపడుతుంటారని తల్లిదండ్రులు కృష్ణకిశోర్, మంజులారాణి తెలియజేశారు. - అర్జున్, అంజన్

ఒకేలా ఆలోచన



నగరంలోని కేఎస్ నాయుడు కాలనీకి చెందిన అంకిత్, ఆశిష్ కవలలు. వారి ఆలోచనలు ఒకేలా ఉంటాయి. ఇష్టాలు కూడా దాదాపు ఒక్కటిగా అనిపిస్తాయి. కవలలు జన్మించడం తమ అదృష్టమని తల్లిదండ్రులు సత్యం, లలితమ్మ సంతోషంగా చెబుతున్నారు. - అంకిత్, ఆశిష్

బాధ్యతాయుతంగా ఎన్నికల విధులు



కలెక్టర్ హరినారాయణన్

చిత్తూరు కలెక్టరేట్ : ప్రశాంత వాతావరణంలో ఎమ్మెల్సీ ఎన్నికలు నిర్వహించేందుకు బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరినారాయణన్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి ఎన్నికల నిర్వహణపై తిరుపతి, అన్నమయ్య, నెల్లూరు, ప్రకాశం, బాపట్ల జిల్లాల కలెక్టర్లు, జేసీలు, డీఆర్‌ఓలు, ఆర్డీఓలతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ పోలింగ్ సిబ్బందికి పక్కాగా శిక్షణ తరగతులు నిర్వహించాలన్నారు. హెల్ప్ డెస్క్ ఏర్పాటుచేసి ప్రతి ఫిర్యాదును రిజిస్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. ఓటింగ్ విధానంపై ఓటర్లకు అవగాహన కల్పించాలన్నారు. కౌంటింగ్ నిర్వహణకు సిబ్బంది గుర్తింపును వేగవంతం చేయాలని కోరారు. బ్యాలెట్ బాక్సులు సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. అన్నిశాఖలతో సమన్వయం చేసుకుని ఎన్నికలను విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేయాలని స్పష్టం చేశారు. సమావేశంలో జేసీ వెంకటేశ్వర్, డీఆర్‌ఓ రాజశేఖర్ పాల్గొన్నారు.

నోడల్ అధికారులతో సమీక్ష

ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లపై నోడల్ అధికారులతో జేసీ వెంకటేశ్వర్ సమీక్షించారు. పోలింగ్ కేంద్రాలలో నిబంధనల మేరకు ఏర్పాట్లు చేయాలన్నారు. పోలింగ్, కౌంటింగ్‌లో ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో నోడల్ అధికారులు జెడ్పీ సీఈఓ ప్రభాకర్ రెడ్డి, హౌసింగ్ పీడీ పద్మనాభం, పీఆర్ ఎస్‌ఈ చంద్రశేఖర్ రెడ్డి, డీఈఓ విజయేంద్ర రావు, సమగ్ర శిక్ష ఏపీసీ వెంకటరమణారెడ్డి, డీటీసీ బసిరెడ్డి, ఎన్‌వైకే అధికారి ప్రదీప్ కుమార్, జిల్లా ఆడిట్ అధికారి రంగయ్య, ఫారెస్ట్ సెటిల్‌మెంట్ అధికారి చంద్రశేఖర్ నాయుడు, జిల్లా కో- ఆపరేటివ్ అధికారి బ్రహ్మానందరెడ్డి, ఎన్నికల సూపరింటెండెంట్ పద్మజ, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి వెంకట్రావ్ పాల్గొన్నారు.

అనుమానాస్పదంగా ఒకరి మృతి



సుబ్రమణ్యం మృతదేహం

చౌడేపల్లె : స్థానిక బస్టాండు సమీపంలోని బోడిబండ వద్ద మంగళవారం అనుమానాస్పదంగా ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలు.. గంగవరం మండలం మబ్బోళ్ల పేటకు చెందిన జి.సుబ్రమణ్యం(50), లక్ష్మీదేవి దంపతులు చౌడేపల్లె భజంత్రీ కాలనీలో నివాసమున్నారు. మేస్త్రీ పనులు చేసుకొంటూ జీవనం సాగిస్తున్నారు. ఈక్రమంలో మంగళవారం ఉదయం భార్యా భర్తలు ఘర్షణ పడ్డారు. తర్వాత ఇంటి నుంచి వెళ్లిన సుబ్రమణ్యం మృతదేహంగా కనిపించాడు. ఎస్ఐ రవికుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పుంగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసుల దర్యాప్తులో సుబ్రమణ్యం మృతికి కారణాలు వెల్లడికావాల్సి ఉంది.

వాల్మీకి, బోయల స్థితిగతులపై అధ్యయనం



మాట్లాడుతున్న శామ్యూల్ ఆనంద్‌కుమార్

చిత్తూరు కలెక్టరేట్ : వాల్మీకి, బోయ కులాల స్థితిగతులపై అధ్యయనం చేశామని, వారి సమస్యలను రికార్డ్ చేశామని ఏక సభ్య కమిషన్ చైర్మన్ శామ్యూల్ ఆనంద్ కుమార్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో బోయ, వాల్మీకి కులాలను ఎస్టీ జాబితాలో చేర్చడంపై సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన మేరకు ఆరుజిల్లాలో పర్యటించామన్నారు. సోమవారం చిత్తూరు జిల్లాని కుప్పం, మండలం గుడుపల్లె మండలాల్లోని వాల్మీకి, బోయల జీవనవిధానాలను పరిశీలించినట్లు వెల్లడించారు. సమావేశంలో వివిధ మండలాలకు చెందిన వాల్మీకి, బోయ కులాల వారు మాట్లాడుతూ సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా చాలా వెనుకబడి ఉన్నామన్నారు. తమ కులాలను ఎస్టీ జాబితాలో చేర్చి సమస్యలు పరిష్కరించాలని విన్నవించారు. జిల్లా సమీపంలోని కర్ణాటకలో వాల్మీకి, బోయలను ఎస్టీలుగా ప్రకటించారని , ఇక్కడ మాత్రం బీసీలుగా పరిగణిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో బీసీ సంక్షేమశాఖ అధికారి రాజ్యలక్ష్మి, గిరిజన సంక్షేమశాఖ అధికారి మూర్తి పాల్గొన్నారు.

రూ.10లక్షల గంజాయి పట్టివేత

కారు సీజ్.. ముగ్గురి అరెస్ట్



పట్టుబడిన గంజాయితోపాటు నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

బంగారుపాళెం: మండలంలోని మహాసముద్రం టోల్ ప్లాజా వద్ద మంగళవారం చేపట్టిన తనిఖీల్లో రూ.10లక్షల విలువైన గంజాయి పట్టుబడినట్లు డీఎస్పీ సుధాకర్‌రెడ్డి తెలిపారు. బంగారుపాళెం పోలీస్‌స్టేషన్ వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. ఆయన కథనం మేరకు.. గంజాయి తరలిస్తున్నట్లు ముందస్తు సమాచారం అందడంతో సీఐ నరసింహారెడ్డి, ఎస్ఐ మల్లికార్జునరెడ్డి, తహసీల్దార్ బెన్నురాజు ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. చిత్తూరు వైపు నుంచి వస్తున్న హోండా సిటీ కారు ఒక్కసారిగా రివర్స్ తీసుకుని వెళ్లబోతుండగా పోలీసులు పసిగట్టి అడ్డుకున్నారు. కారులో 96 కిలోల గంజాయి ప్యాకెట్లు గుర్తించారు. నిందితులు తమిళనాడులోని కోయంబత్తూరు జిల్లా కునియముత్తూరు తాలూకా వసంతరామ్ గార్డెన్‌కు చెందిన అబ్దుల్ జలీల్(35), కేరళలోని కాలికట్ జిల్లా నెల్లికొట్టుపరంబిల్ హౌస్‌కు చెందిన మురళీధరన్(37), కోజికోడ్ కేతిహౌస్‌కు చెందిన అభిలాష్(33)ను అరెస్ట్ చేశారు. వారిని విచారించగా హోసూరు చెందిన సంబు, కోయంబత్తూరుకు చెందిన రమేష్‌తో కలిసి విశాఖ సమీపంలోని నర్సీపట్నం వద్ద గంజాయి కొనుగోలు చేశామని, బెంగళూరుకు తరలిస్తున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, సంబు, రమేష్‌ను త్వరలోనే పట్టుకుంటామని డీఎస్పీ తెలిపారు.

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి

గుడుపల్లె : మండలంలోని బోదగుట్ట అటవీప్రాంతంలో అనుమానాస్పదంగా ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ రామాంజనేయులు కథనం మేరకు.. ఓ కుంటలో మృతదేహం కనిపించడంతో స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని వెలికి తీసి దాసిమానిపల్లెకు చెందిన మురుగేష్ (30)గా గుర్తించారు. మృతుడి తండ్రి మునివెంకటప్ప, భార్య నీలమ్మకు సమాచారం తెలియజేశారు. వారు అక్కడకు చేరుకుని విలపించారు. తన భర్తను ఎవరో కొట్టి చంపేశారని నీలమ్మ ఆరోపించింది. ఈమేరకు పోలీసులకు ఫిర్యాదు చేసింది. అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కుప్పం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

తమిళ బియ్యం పట్టివేత

గుడుపల్లె : కర్ణాటక రాష్ట్రానికి సుమోలో అక్రమంగా తరలిస్తున్న 30 బస్తాల తమిళనాడు బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రామాంజేయులు తెలిపారు. మంగళవారం శెట్టిపల్లె వద్ద చేపట్టిన వాహన తనిఖీల్లో బియ్యం పట్టుబడినట్లు వెల్లడించారు. సుమోను సీజ్ చేసి తిరుపత్తూరుకు చెందిన డ్రైవర్లు సత్యవేలు, వేలుమలైను అదుపులోకి తీసుకున్నట్లు వివరించారు.

పేదల భూముల్లో పచ్చ గద్దలు

- దర్జాగా కబ్జా చేసిన టీడీపీ నేతలు
- గత ప్రభుత్వ హయాంలో యథేచ్ఛగా దౌర్జన్యం
- న్యాయం చేయాలంటున్న బాధిత రైతులు



బాధిత రైతు పేరుతో పట్టాదారు పాసుపుస్తకం



టీడీపీ నేతలు ఆక్రమించున్న భూమి

నగరి : మండలంలోని ఓజీ కుప్పంలో టీడీపీ నేతలు నారాయణ స్వామినాయుడు, సుబ్రమణ్యం ఆక్రమణ పర్వంపై బాధిత రైతులు గొంతువిప్పారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో తమకు న్యాయం జరుగుతుందనే నమ్మకంతోనే మీడియా ముందుకు వచ్చినట్లు వారు తెలిపారు. మంగళవారం ఓజీ కుప్పం రైతులు మాట్లాడుతూ టీడీపీ నేతల కబంధ హస్తాల నుంచి తమ భూములను కాపాడాలని విన్నవించారు. బాధితుల కథనం మేరకు.. గత తెలుగుదేశం ప్రభుత్వంలో గ్రామానికి చెందిన అరుణ, చందుకు చెందిన 2.25 ఎకరాలు, మురళి, కన్నెమ్మకు చెందిన 60 సెంట్లు, వెంకటేష్‌కు చెందిన 60 సెంట్లు, సుధాకర్‌కు చెందిన 3 ఎకరాలు కబ్జాకు గురయ్యాయి. పట్టాదారు పాసుపుస్తకం ఉన్నా, ఆన్‌లైన్‌లో నమోదైనా అప్పటి రెవెన్యూ అధికారులు న్యాయం చేయలేదు. తెలుగు తమ్ముళ్ల బలం ముందు సన్నకారు రైతుల పోరాటం నిలబడలేదు. చివరకు కోర్టు ఆదేశాలు జారీ చేసినా, ఎట్టకేలకు స్పందించిన అధికారులు సర్వే చేసి సరిహద్దులు నిర్ణయించినా టీడీపీ నేతల దాష్టీకం ముందు నిష్ప్రయోజనంగా మారాయి. దిక్కుతోచక కొట్టుమిట్టాడుతున్న బక్క రైతులు ఇన్నాళ్లకు తమ న్యాయం చేయాలని మళ్లీ గళం విప్పడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. దీనిపై పోలీసులకు సైతం బాధిత రైతుల ఫిర్యాదు చేయడం గమనార్హం.

దౌర్జన్యంతో లాక్కున్నారు



నా పేరిట ఉన్న 2.25 ఎకరాలను టీడీపీ నేతలు దౌర్జన్యంగా లాక్కున్నారు. పట్టాదారు పాసుపుస్తకం చూపించినా అప్పటి అధికారులు పట్టించుకోలేదు. న్యాయం అడగడానికి వెళితే జన్మభూమి కమిటీ సభ్యుడిని నన్ను ఎవరూ ఏమీ చేయలేరని తరిమేశారు. దీంతో కోర్టును ఆశ్రయించి అనుకూలంగా తీర్పువచ్చినా ప్రయోజనం లేకుండా పోయింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే న్యాయం చేయాలి.
– అరుణ, బాధిత రైతు, ఓజీ కుప్పం

చనిపోయినట్లు రికార్డు సృష్టించారు



నేను చనిపోయానంటూ రికార్డులు సృష్టించి నా కుటుంబ భాగంగా రావలసిన భూమిని వారి పేరిట మార్పు చేసుకున్నారు. నా భూమి అప్పగించాలని అడిగితే బెదిరించి పంపేశారు. నా 3.5 ఎకరాల భూములను వారే సాగుచేసుకుంటున్నారు. టీడీపీ ప్రభుత్వంలో అధికారులు ఎవరూ సహకరించలేదు. ఇప్పుడు న్యాయం జరుగుతుందని నమ్మకం వచ్చింది.
– సుధాకర్, బాధితరైతు, ఓజీకుప్పం

2016 నుంచి పోరాడుతున్నాం



మాది 60 సెంట్లు ఆక్రమించుకుని టీడీపీ నేతలు మాపైనే దౌర్జన్యం చేస్తున్నారు. 2016 నుంచి మా భూములకోసం పోరాడుతూనే ఉన్నాం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యవహారశైలి వల్ల ఇప్పుడు మాకు న్యాయం జరుగుతుందనే నమ్మకం వచ్చింది. అందుకే ధైర్యంగా బయటకు వచ్చి వివరాలు తెలియజేస్తున్నాం.
– మురళి, బాధిత రైతు, ఓజీకుప్పం

తప్పకుండా న్యాయం చేస్తాం



బాధిత రైతుల వద్ద ఉన్న రికార్డులను పరిశీలించి తప్పకుండా న్యాయం చేస్తాం. ఆక్రమిత భూములను స్వాధీనం చేసుకుని అసలు రైతులకు అప్పగిస్తాం. కబ్జాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించం. రైతులు తెలిపిన వివరాల మేరకు సర్వేనంబర్లలోని భూమిని సర్వే చేయిస్తాం.
– చంద్రశేఖర్ రెడ్డి, తహసీల్దార్, నగరి